## మినీ కథ

# సురభి

### విశ్వనాథ పావని శాస్త్రి




ఆడదాని ముఖాన్ని చంద్రబింబంతో పోల్చి మంచిపని చేశారు మన కవులు. ఎందుకంటే ఇవాల్టికికూడా మనదేశంలో ఆడవాళ్ళు (కొందరు) కొంత కాకపోతే కొంతయినా స్వయంప్రకాశత్వం తెచ్చుకోలేకపోతున్నారు. దీనికి మా సురభి మరో ఉదాహరణ.

సురభి నాకు మేనత్త కూతురు. ముప్పై ఏళ్ళుంటాయి. నాకన్న ఏడాది పెద్దదనీ ఎదురు మేనరికం అనీ మా వాళ్ళెవరూ మా యిద్దరికీ పెళ్ళి తలపెట్టలేదు. కాని సురభి ఎమ్. ఏ. ప్యాసయింది. ఏడెనిమిది వందల రూపాయల ఉద్యోగం చేస్తోంది. చామన చాయ మనిషి. కనుముక్కు తీరు చక్కగా వుంటుంది. కళగల ముఖం చాలా తెలివి గలది. అందంగా మాట్లాడుతుంది. ఇంటి పనుల్లో మా అత్తయ్య కెంతో సాయం చేస్తూంటుంది. ఇటువంటి సురభికి యింతవరకూ పెళ్ళి కాకపోవడం చూస్తూంటే నాకెంతో ఆశ్చర్యం వేస్తుంది.

పెళ్ళి చూపుల కెవరూ రాలేదా అంటే అయ్యో దానికేం భాగ్యం? చాలా మందే వచ్చారు. ఉద్యోగం చేస్తున్న పిల్ల వద్దని కొందరు. అంత చదువుకున్న పిల్ల వద్దని కొందరు. అబ్బే పిల్ల పొడుగని కొందరు. ఎఱ్ఱగా లేదని కొందరు. నల్లగా వుందని కొందరు. కట్నం చాలదని కొందరు. వాళ్ళ శ్రాద్ధం చాలదని కొందరు. కాఫీ టిఫిన్లు లాగించెయ్యడం ఎవరికి తోచిన వంకలు వాళ్ళు పెట్టి వెళ్ళిపోవడం తప్ప ఒకళ్ళూ సంబంధం ఖాయం చేసుకోలేదు. పైగా ప్రతి వాళ్ళకీ చచ్చేటంత కట్నాలు కావాలి. ఛీఛీ! ఏం మనుష్యులో? ఏమిటో?

* * *

చిన్నప్పుడొకసారి సురభివాళ్ళ ఊరు వెళ్ళాను. వాళ్ళ యింట్లో రెండావులు. రెండు గేదెల పాడి వుండేవి. ఒక రోజున ఒక ఆవు తెగ అరుస్తోంటె వాళ్ళ పాలేరు ఎక్కడికో తోలుకెళ్తున్నాడు. అది చూసి నేను మా మామయ్యను. "అదేమిటి మామయ్యా? ఆ ఆవు అలా అరుస్తోంది? దానికేమైనా రోగం వచ్చిందా?" అని అడిగాను. దాని కాయన చిలిపిగా నవ్వుతూ. "అవునోయ్! ఎదరోగం వచ్చింది" అన్నారు. నాకర్థంగాక "అదేం రోగం?" అమాయకంగా మళ్ళీ అడిగాను. ఆయన యింకా చిలిపిగానవ్వుతూ విపరించి చెప్పారు. నాకు సిగ్గేసింది. ఇదెప్పుడో పదిహేను, పదహారేళ్ళ క్రిందటి మాట.

* * *

ఇప్పుడెక్కడో దూరాన ఉద్యోగం చేస్తున్న నాకు హఠాత్తుగా ఒక రోజున—నాల్గు రోజులలో సురభి పెళ్ళి అని శుభలేఖ వచ్చింది. వెంటనే శలవు పెట్టేసి హడావిడిగా పరుగెత్తుకుని వచ్చేశాను. తీరాచూస్తే పెళ్ళికొడుకు తల్లి దండ్రుల కొక్కడే కొడుకు. బి. ఏ ప్యాసయ్యాడు. ముప్పై రెండేళ్ళుంటాయి. ప్రస్తుతం ఉద్యోగం లేదు. ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలో పేరు రిజిస్టరు చేయించాడు. ఫరవాలేదు. రిటైరయ్యే వయస్సులోపల ఏదో ఒక ఉద్యోగం రావచ్చు. బెజవాడలో యిల్లుంది. అద్దెలొస్తాయి. అన్నీ బాగానే వున్నాయి. కాసీ కట్నం పదిహేనువేల రూపాయలట. ఇదేం అన్యాయం?

సురభికన్న ఎక్కువ చదివాడనా? లేదే! సురభికన్నా గొప్ప ఉద్యోగంచేస్తున్నాడనా? అసలింతవరకు ఉద్యోగమే లేదుకదా? పోనీ సురభి ప్రక్కన నిలబడితే మన్మథుడల్లే ఉంటాడనా? అదీ లేదు. మరతను మగాడనా? అయితే సురభి ఆడది కాదా? అబ్బే అవేంకావండీ! మరేమిటి? ఏమిటో అల్లా నడుస్తోంది ఒక దుష్టసంప్రదాయం. అంతే! అతనికి బుద్ధిలేదు అతని తల్లిదండ్రులకంతకన్నా లేదు. ఒప్పుకున్నాం. మా మామయ్యకీ అత్తయ్యకీ కూడా లేదా? లేదు. సరే! అదీ ఒప్పుకున్నాం! సురభి కేమైనట్టు? దానంత చదువుకుని యింత ఉద్యోగం చేస్తూ యిలా కట్నానికి లొంగిపోవడమేనా? తనకికపెళ్ళి కాదని భయమా? లేకపోతే, ఆడదానికి మగదిక్కు లేకపోతే కష్టమనా? ఈ భయాలు మగవాడికి లేవా? వాడికక్కర్లేదా ఆడతోడు? వెనకటి తరంలోని కన్యాశుల్కమనే మహా విషవృక్షాన్ని సమూలంగా పెల్లగించి పారేసిన మన సమాజంలో ఆ స్థానంలో ఈ వరకట్న పిశాచి ఏమిటి? నో! సురభిలాటి చదువుకున్న ఆడపిల్లలు కూడా యిలా జ్ఞానాన్ని కోల్పోకూడదు.

ఇలా ఆవేదనపడుతూ తిరుగుతున్న నాకు మా మామయ్య వాళ్ళ చూడి ఆవు ఒకటి కనిపించింది. నా మనస్సులో ఏదో మెరిసింది. ఆహా! నిజమే! నాదే పొరపాటు. నా దేశంలో స్త్రీ గోమాత!